నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, గురువారం 8 ఫిబ్రవరి 2024 | NALGONDA

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ చందనాదీప్తి

నీలగిరి, ఫిబ్రవరి 7 : డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ యజమానులతో ఆమె సమావేశం నిర్వహించారు. యువత మత్తులో దించే గంజాయి, ఇతర వస్తువులపై పోలీసుల నిఘా ఎక్కువ కావడంతో మందుల కొనుగోళ్లపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. విచ్చలవిడిగా ఫార్మింగ్ డ్రగ్స్ విక్రయిస్తున్నందున యువత మత్తుకు బానిస అవుతున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల ఒక మెడికల్ షాప్‌పై కేసు పెట్టామని, మెడికల్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే టాబ్లెట్లు, ఇంజెక్షన్లు విక్రయించొద్దని సూచించారు. మెడికల్ షాప్ యజమానులు నార్కోటిక్ డ్రగ్స్ విక్రయించేందుకు నిబంధనల ప్రకారం లైసెన్స్ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ దాసు, సీఐలు రుద్వీర్ కుమార్, శ్రీను, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటపతి, చిలుకూరి పరమాత్మ, మెడికల్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

'చలో నల్లగొండ' ఏర్పాట్లు షురూ

మర్రిగూడ బైపాస్ రోడ్డులో బహిరంగ సభ

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సభా స్థలం పరిశీలన

- నేటినుంచి చకచకా పనులు
- సభకు విస్తృత ప్రచారం కల్పించడంపై దృష్టి
- రంగంలోకి బీఆర్ఎస్ నేతలు
- సభకు అనుమతి కోసం ఎస్పీకి లేఖ

కేఆర్ఎంబీకి కృష్ణానది ప్రాజెక్టులు అప్పగింతను నిరసిస్తూ బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్లగొండ సభకు ఏర్పాట్లు షురూ అయ్యాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొననున్న బహిరంగ సభ కావడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారని పార్టీ నేతలు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా సభా స్థలాన్ని ఎంపిక చేశారు. నల్లగొండ పట్టణ శివారులోని మర్రిగూడ బైపాస్‌లో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారికి ఆనుకుని విశాలమైన స్థలంలో సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం సభాస్థలాన్ని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ నేతలు పరిశీలించారు. సభకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు.

– నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి7(నమస్తే తెలంగాణ)

కేంద్రం పరిధి నుంచి శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కాపాడుకునేందుకు ఈ నెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు సిద్ధమైంది. ఈ సభకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు మొదలయ్యాయి. బుధవారం సభా స్థలాన్ని ఫైనల్ చేస్తూ పోలీసుల అనుమతి కోరారు. నల్లగొండ శివారులోని మర్రిగూడ బైపాస్‌లో నార్కట్‌పల్లి- అద్దంకి రహదారికి ఆనుకుని ఉన్న సభా స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ స్థలాన్ని జగదీశ్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, యాదాద్రి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, సమన్వయ కర్త రవీందర్‌సింగ్ పరిశీలించారు. సభా వేదిక, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. సభకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సభకు పెద్ద సంఖ్యలో తరలిచ్చే అవకాశాలు ఉండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి ప్రజలు, ముఖ్యంగా రైతులు తరలిరానున్నట్లు నేతలు అంచనా వేస్తున్నారు. దీంతో సభకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. నేటి నుంచి సభాస్థలం చదును చేయడంతో పాటు ఇతర ఏర్పాట్లను కూడా చకచకా పూర్తి చేసేందుకు ప్లాన్ చేశారు. సభకు పోలీసుల అనుమతి తప్పనిసరి కావడంతో జిల్లా ఎస్పీ చందనా దీప్తిని కలిసి లేఖను అందజేశారు. నిబంధనల ప్రకారం పరిశీలించి అనుమతిపై నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్పీ వెల్లడించారు.

సభా స్థలం పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, సభ సమన్వయ కర్త రవీందర్ సింగ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

విస్తృత ప్రచారం

ఇక కృష్ణా జలాలను కేఆర్ఎంబీకి అప్పగిస్తే జరిగే నష్టంపై ప్రజలను చైతన్యం చేయాలని పార్టీ నేతలు నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ యావత్తు రంగంలోకి దిగనుంది. నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో పాటు రాష్ట్ర పార్టీ నుంచి కూడా సమన్వయకర్తలను నియమించారు. వీరంతా నేటి నుంచే తమకు అప్పగించిన బాధ్యతలకు అనుగుణంగా పార్టీ శ్రేణులతో భేటీ కానున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకాన్ని ఈ సందర్భంగా ప్రజల్లో ఎండగట్టనున్నారు. క్షేత్రస్థాయి వరకు ప్రజల వద్దకు వెళ్లి పరిస్థితిని వివరించి సభకు తరలివచ్చేలా చూడనున్నారు. సభలో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర ప్రాజెక్టులపై సమగ్ర అవగాహన కలిగిన కేసీఆర్, ప్రాజెక్టులు కేంద్రం పరిధిలోకి వెళ్లడం వల్ల జరిగే ఇబ్బందులను ప్రజలకు వివరించనున్నారు. గత పదేండ్లుగా బీఆర్ఎస్ సర్కార్ హయాంలో కేంద్రం కుట్రలను ఎలా తిప్పికొట్టి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీని కాపాడుకున్నామో ప్రజలకు స్పష్టం చేయనున్నారు. వీటన్నింటి నేపథ్యంలో రానున్న కాలంలో ప్రాజెక్టుల పరిరక్షణకు దిశానిర్దేశం చేయనున్నారు. దీంతో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ సభను విజయవంతం చేసేందుకు పార్టీ యావత్తు రంగంలోకి దిగనుంది.

తెలంగాణ హక్కుల సాధనకు తెగించి కొట్లాడుతాం

- పోలీస్ యాక్ట్‌లు, నిర్బంధాలు, సంకెళ్లు మాకు కొత్తేం కాదు
- ఎన్ని అవాంతరాలు సృష్టించినా 13న సభ నిర్వహిస్తాం
- సాగర్ నీటిలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నీలగిరి, ఫిబ్రవరి 7 : 'నీళ్లు, నిధులు, నియామకాల కోసం బీఆర్ఎస్ ఏర్పడ్డది. తెలంగాణ ప్రజల హక్కుల సాధనకు పేగులు తెగేదాకా కొట్లాడుతాం. పోలీసులు యాక్టులు, సంకెళ్లు, నిర్బంధాలు మాకు కొత్తేమి కాదు. ఎన్ని అవాంతరాలు పెట్టినా ఈ నెల 13న నాగార్జున సాగర్ నీటిలో జరుగుతున్న అన్యాయంపై ప్రజలకు వివరించి తీరుతాం' అని రాష్ట్ర మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణ శివారు ప్రాంతంలో ఈ నెల 13న నిర్వహించే భారీ బహిరంగ సభా స్థలాన్ని పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు కూడా కాకముందే కాంగ్రెస్ మరోసారి తెలంగాణ ప్రజల అత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టిందన్నారు. కృష్ణా జలాలను కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి అప్పగించడం చాలా అన్యాయమని తెలిపారు. ఈ నెల 13న చలో నల్లగొండ పేరుతో నిర్వహించే భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని, కృష్ణా జలాల్లో జిల్లా ప్రజలు, రైతాంగానికి కాంగ్రెస్ చేసిన బాగోతాన్ని, ఆ పార్టీ నైజాన్ని బట్టబయలు చేస్తామని చెప్పారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలోని ప్రాజెక్టులను చేజేతులా కేఆర్ఎంబీకి అప్పగించిన నీచులు కాంగ్రెస్ నాయకులని ఆయన మండిపడ్డారు. సాగర్ ఆయకట్టు రైతాంగం తీవ్ర మనోవేదనకు గురవుతుంటే ఆదుకోవాల్సింది పోయి మళ్లీ ఎదురు దాడి చేస్తూ కాంగ్రెస్ నేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. కేంద్రం నుంచి ఏదో ఆశించే కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రాజెక్టులను వారికి అప్పజెప్పారని పేర్కొన్నారు. సాగర్ డ్యామ్‌పై కేంద్ర బలగాలు మోహరించాయని, కాలు కూడా పెట్టనివ్వడం లేదని అన్నారు. తెలంగాణ ఇరిగేషన్ మంత్రిగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉన్నప్పటికీ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతుంటే మరోవైపు జిల్లాకు చెందిన మరో మంత్రి కోమటిరెడ్డి మతి స్థిమితం లేకుండా మాట్లాడుతున్నరని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు పోలీసులతో రాజ్యం నడుపాలని చూస్తే వారి పతనం తప్పదని, ప్రజలు ఉరికించి కొడుతారని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని, పెద్ద పెద్ద రాకాసులతో కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించామని, ఈ చిన్న చిన్న రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి తమకు లెక్కకాదని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలంతా పైటర్స్ అని, కాంగ్రెసోళ్లకు ఏమాత్రం భయపడేది లేదని, ఆరునూరైనా మాజీ సీఎం కేసీఆర్‌తో సభ నిర్వహించి తీరుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చెరుకు సుధాకర్, ఐసీడీఎస్ మాజీ ఆర్ఓ మాలె శరణ్యారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంధినేని జనార్దన్‌రావు, మారగోని గణేశ్, నాయకులు మెరుగు గోపి, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కోదాడలో వంద పడకల దవాఖాన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రులు దామోదర రాజనర్సింహ, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, అధికారులు

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- 1800 రోగాలకు ఆరోగ్య శ్రీ వర్తింపు : మంత్రి దామోదర రాజనర్సింహ
- కోదాడలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌తో కలిసి వంద పడకల దవాఖానకు శంకుస్థాపన
- హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ దవాఖాన సందర్శన

కోదాడ/నేరేడుచర్ల, ఫిబ్రవరి 7 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కోదాడలో వంద పడకల దవాఖాన నిర్మాణానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు హుజూర్‌నగర్ పట్టణంలోని 100 పడకల ఏరియా దవాఖానను మంత్రులు పరిశీలించారు. ఇన్ పేషెంట్‌లకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసానిస్తున్నదన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని సూచించారు. 1800 రోగాలకు ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సేవలు పొందవచ్చన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయని, వాటి నుంచి వచ్చే స్పెషల్ డెవలప్ ఫండ్‌ను వైద్యశాలకు ఖర్చు చేస్తే బాగుంటుందని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ చట్టబద్ధతకు దామోదర రాజనర్సింహ కృషి ఎనలేనిదన్నారు. రెడ్లకుంట ఎత్తిపోతల పథకాలతో వెయ్యి ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. ఎన్ఆర్‌జీ కింద రూ.12 కోట్లు, మరో రూ. 10 కోట్లు ఎమ్మెల్యే పద్మావతి ద్వారా మంజూరు అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, జిల్లా అడిషనల్ కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డి, ఎస్పీ రాహుల్ హెగ్డే, డీఎంహెచ్‌ఓ వెంకటాచలం, డీసీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ ప్రకాశ్, హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, నాయకులు ఎర్నేని వెంకటరత్నంబాబు, వంగవీటి రామారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, హుజూర్‌నగర్, కోదాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్లు కరణ్‌కుమార్, దశరథ, మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చనా రవి, హుజూర్‌నగర్ ఎంపీపీ గూడెపు శ్రీను, డాక్టర్ జాస్తి సుబ్బారావు పాల్గొన్నారు. తొలుత హుజూనగర్‌కు హెలికాప్టర్‌లో వచ్చిన మంత్రులకు అధికారులు, రాజకీయ నాయకులు ఘన స్వాగతం పలికారు.

ప్రేమ జంటలే లక్ష్యంగా దోపిడీ

- బెదిరించి నగదు, బంగారం దోచుకుంటున్న ముఠా అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ చందనా దీప్తి

నీలగిరి, ఫిబ్రవరి 7 : నల్లగొండ పట్టణ శివారు ప్రాంతంలో కొద్ది రోజులుగా ప్రేమ జంటలను బెదిరించి బంగారు అభరణాలు, నగదును దోపిడీ చేస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఒక బైక్, బంగారు ఉంగరం, రెండు సెల్‌ఫోన్లు, మూడు ఫ్యాన్లు, ఒక యాపిల్ వాచ్, డ్రిల్లింగ్ మిషన్, ఇక ఇన్వర్టర్, రెండు టీవీలు, హోం థియేటర్, గ్యాస్ స్టౌను స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలు వెల్లడించారు. ఈజీగా డబ్బులు సంపాదించాలని నల్లగొండ పట్టణంలోని నర్సింహారెడ్డి కాలనీకి చెందిన ముగ్గురు అన్నదమ్ములు కుంచం చందు, కుంచం ప్రశాంత్, కుంచం రాజు, వారి బంధువు శివరాత్రి ముఖేశ్‌తోపాటు మరో ముగ్గురు చింత నాగరాజు, అన్నెపురి లక్ష్మణ్, మరొక మైనర్ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు నల్లగొండ పట్టణ శివారులో తిరుగుతూ నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై పోయే ప్రయాణికులు, ప్రేమ జంటలు ఏకాంతంగా ఉండటాన్ని గమనించి సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తారు. అనంతరం వారిని కొట్టి బెదిరించి డబ్బులు, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌లను కాజేసేవారు. బాధితుల వద్ద డబ్బులు లేకుంటే పేటీఎంతోపాటు పెట్రోల్ బంకులో స్కానింగ్ చేయించి దోచుకునే వారు. ఇలా దోపిడీ చేసిన డబ్బులను తాగుడు, విలాసాలకు ఖర్చులు చేసే వారు. ఇటీవల గొల్లగూడ శివారు ప్రాంతంలోని ఒక వెంచర్‌లో దొంగతనం కూడా చేశారు. ఇలా వీరిపై నల్లగొండ టూటౌన్‌లో మూడు, వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైంది. ఫిబ్రవరి ఒకటిన ఒక జంట కారులో వచ్చి వెంట తెచ్చుకున్న భోజనం చేస్తుండగా వారిని బెదిరించి రెండు సెల్‌ఫోన్‌లు గుంజుకోవడంతోపాటు 700 నగదు తీసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా బుధవారం కుంచం చందు ఇంటివద్దకు టూటౌన్ పోలీసులు వెళ్లగా మిగతా ఐదుగురు కూడా అక్కడే ఉండడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఇలాంటి కేసులో ఎవరైనా బాధితులు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. కేసు విచారణ చేసిన టూటౌన్ సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ రావుల నాగరాజు, సిబ్బంది బాలకోటి, శంకర్‌ను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో సైబర్ సెల్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ రావుల నాగరాజు సిబ్బంది ఉన్నారు.

తుంగతుర్తిలో బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే కిశోర్, జడ్పీ చైర్మన్లు దీపిక, సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకుడు నర్సింహారెడ్డి తదితరులు

తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీ శ్రీరామరక్ష

హామీలు నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారు

- పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చూపిద్దాం
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- తుంగతుర్తిలో బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

తుంగతుర్తి, ఫిబ్రవరి 7 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగించడం ఆ పార్టీ నాయకుల చేతగానితనమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలోతుంగతుర్తిలో బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి రెండు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ పనితీరు బయటపడిందన్నారు. సాగు నీటి విషయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించకపోవడం జిల్లా ప్రజలకు అన్యాయం చేసినట్లేనని తెలిపారు. రైతు బంధు పడడం లేదని అడిగిన వారిని చెప్పుతో కొడుతానని మంత్రి కోమటిరెడ్డి అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై మంత్రి పోలీసులతో దౌర్జన్యం చేయించడం సరి కాదని చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు కష్టపడితే ఎంపీ సీట్లు బీఆర్ఎస్‌వేనని తెలిపారు.

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు దుర్మార్గం

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

గడిచిన పదేండ్ల కాలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేశారని మాజీ ఎమ్మెల్యే కిశోర్ అన్నారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు సీఎం రేవంత్‌రెడ్డికి తగదని హెచ్చరించారు. ఎన్నికల ముందు రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి నేటి వరకు చేయని దద్దమ్మ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. రానున్న ఎంపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని, అందుకు గులాబీ సైన్యం సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్లు గుజ్జ దీపికాయుగంధర్‌రావు, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, నాయకులు ఒంటెద్దు నరసింహారెడ్డి, బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రైతుబంధు సూర్యాపేట జిల్లా మాజీ అధ్యక్షుడు రజాక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, ఎంపీపీ గుండగాని కవితారాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

వట్టిపోయిన హాలియా వాగు



అడుగంటిన హాలియా వాగు



అనుముల మండలం ఇబ్రహీంపేట స్టేజీ సమీపంలో హాలియా వాగు వెంట నెర్రెలు బారిన వరి పంట

- సాగర్ నుంచి నీటి విడుదల బంద్
- బోర్లు, బావుల కింద సాగు చేసిన రైతులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలతో ఎండుతున్న పంటలు

హాలియా, ఫిబ్రవరి 6 : నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు లేకపోవడంతో ప్రభుత్వం ఆయకట్టు పరిధిలో క్రాప్ హాలిడేని ప్రకటించింది. యాసంగిలో పంటలు సాగు చేయొద్దని వెల్లడించింది. దాంతో బోర్లు, బావుల కింద రైతులు కొద్ది మొత్తంలో వరి సాగు చేశారు. కానీ రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. దీనికి తోటు కరెంట్ కోతలు కూడా రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. ఆయకట్టు పరిధిలోని హాలియా వాగుకు సాగర్ నుంచి నీటి విడుదల లేకపోవడమే దీనికి ప్రధాన కారణం.

తొమ్మిదేండ్లు రెండు కార్లు పండించిన రైతులు

2014 నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద రైతులు రెండు పంటలు పండించారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతోపాటు ప్రాజెక్టులో ఆశించిన జలాలు ఉండడంతో పెద్ద మొత్తంలో వరి వేశారు. సాగర్ నియోజకవర్గంలోనే లక్ష ఎకరాల్లో సాగు చేశారు. దీనికి తోడు 24 గంటల కరెంట్ ఉండడం కలిసి వచ్చింది. పంటల దిగుబడి బాగా రావడంతో రైతుల ఇంట నెలకొన్నది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పరిస్థితి మారింది. వర్షాభావ పరిస్థితులకు తోడు సాగర్‌లో జలాలు లేకపోవడం, కరెంట్ కోతలతో పంటల సాగు కష్టంగా మారింది. యాసంగిలో 30 శాతమే వరి సాగు చేశారు. అది కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు.

హాలియా వాగు వెంట ఇదీ పరిస్థితి

అనుముల మండలంలో హాలియా వాగుకు ఇరువైపుల ఉన్న రైతులు వాగు నీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తారు. బోరుబావులతోపాటు, వాగులో మోటర్లు పెట్టి వరి పండిస్తున్నారు. గతేడాది వరకు బాగానే ఉండగా ఈ సంవత్సరం సాగర్ నుంచి నీటి విడుదల లేక వట్టిపోయింది. దీనికి తోడు హాలియా వాగుపై ఎగువన రెండు, మూడు చోట్ల నాబార్డు నిధులతో చెక్‌డ్యామ్‌లను నిర్మించారు. దాంతో ఎగువ నుంచి నీరు దిగువకు వచ్చే అవకాశం లేదు. రైతుల విజ్ఞప్తి మేరకు రెండు రోజులుగా మేజర్ కాల్వలకు సాగ ర్ నీటిని విడుదల చేసినా సరిపడా రాలేదు. హాలియా వాగును నమ్ముకొని వరి వేసిన పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో రైతు ఎకరానికి 15 వేల రూపాయలు పెట్టుబడి పెట్టగా అవన్నీ నేలపాలయ్యేటట్లు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరు అందక పొలం ఎండిపోతున్నది

నేను మా ఊరిగుండా వెళ్తున్న హాలియా వాగు నీళ్లను నమ్ముకొని 3 ఎకరాల్లో వరిసాగు చేసిన. గతంలో వాగులో 365 రోజులు నీళ్లు ఉండేవి. ఈ ఏడాది వర్షాలు సరిపడా కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయి. బోర్లు పోస్తలేవు. కరెంట్ కూడా రోజుకు 16 గంటలకు మించి ఇవ్వడం లేదు. నీళ్లు లేక పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

– చెన్నబోయిన శ్రీను, రైతు, రామడుగు, అనుముల మండలం

పంట చేతికి వస్తదన్న నమ్మకం లేదు

నేను పేరూరు సోమేశ్వర స్వామి దేవాలయ భూమిని రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. కౌలు 28వేలు రూపాయలు. వానకాలంలో ఎడమ కాల్వ నీరు రాకపోవడంతో వాగుకు మోటర్ వేసి పారించాను. ఇప్పుడు వాగు కూడా ఎండిపోయింది. 15 రోజులుగా పంట పొలానికి సాగునీరు లేక ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ఒకటి రెండు రోజులు సూరేపల్లి మేజర్‌కు సాగర్ నీళ్లు ఇవ్వడంతో పాలానికి పెట్టుకుంటున్నా. ఇంకా రెండు నెలలైతే పొలం చేతికి వస్తది. ఈ ఏడాది పంట చేతికి వస్తదన్న నమ్మకం లేదు. కౌలు గింజలన్న ఎల్లదీద్దామని వరి వేసే చేస్తే అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చింది.

–నాగేండ్ల రామలింగయ్య, కౌలు రైతు, ఇబ్రహింపేట, అనుముల మండలం